# ముష్టివాళ్ళంటే...?

రచన: శ్రీ మంచికట్ల రాజయ్య.

గత రెండు దినాల నుంచి ఏదైనా ఒక మంచి కథ వ్రాయాలని- ప్లాట్-కోసం ఆలోచిస్తున్నాడు కథకుడు రాంబాబు. ఏ పాడు ఘడియలో ఆలోచన మొదలు పెట్టాడో గానీ, సఫలీకృతుడు కాలేక పోతున్నాడు. సంపన్న కుటుంబానికి చెందిన ఒక స్త్రీని, నిత్య నూత్న దరిద్రంతో అలమటించే బీదవానికి అంట గట్టి కథ వ్రాయాలనుకున్నాడు. కాని సాగలేదు...ఫ్చ్! ఇది బాగు లేదనుకున్నాడు-ఇద్దరు బిచ్చగాళ్ళను తీసుకుని క్రింది తరగతి జీవితాలలో ప్రేమఎలా ఉంటుందో చక్కగా వివరిస్తూ కథ వ్రాయాలనుకుని, వ్యవహారిక భాషలో మొదలెట్టి, కథకునిగా సాధ్యమైనంతవరకు వాళ్ళ స్థితి గతులను పరిచయం చేస్తూ, నాయికా నాయకుల ప్రణయ ఘట్టం ఎలా నడపాలో తోచక కలాన్నాపి వేశాడు...మరి ఎలా? ఏ కోవకు చెందిన సమస్యను తీసుకుని కథ వ్రాయాలి? మొత్తానికి వర్తమానం దృష్టిలో పెట్టుకుని తను వ్రాయ బోయే కథ నేటి సమకాలీన సమాజానికి ప్రతి బింబంలా ఉండాలి. సత్యదూరం కాకూడదు; అనుకున్నాడు.

ఇలా ఆలోచిస్తూనే యింకో రెండు మూడు దినాలు గడిచాయి. వారం దినాలు గడిచినా కథకు సరయిన "థీమ్" దొరక్క రాంబాబు లోలోనే కుంచించుకు పోయాడు.

అంతలోనే అతనికో చక్కని ఆలోచన తట్టింది. తన స్నేహితుడు డాక్టర్ హరిప్రసాద్‌ను కలిస్తే ఎవరో ఒక పేషెంట్ కేసు గురించి చెప్పక పోడని, హరిప్రసాద్‌ను కలవడానికి బయలుదేరాడు రాంబాబు.

"డాక్టర్ గారూ!" అంటూ పిల్చాడు, యింటి ముందు నిల్చుని తలుపు తడుతూ.

"ఓఁ! వస్తూన్నా" అంటు వచ్చి తలుపుతీసి, ఎదుటగా తన మిత్రుడు రచయిత అయిన రాంబాబును చూసి సంతోషంగా "మీరా? రండి లోపలికి_ఏమిటి విశేషాలు?" అంటు రాంబాబును లోనికి తీసుకు వెళ్ళి, తనో కుర్చీలో కూర్చుంటూ, అతనికో కుర్చీని చూపించాడు.

ఆశీను డౌతున్న రాంబాబుతో_"ఏం? చాలా దినాలైంది_కలవడం..." అన్నాడు డాక్టర్ హరిప్రసాద్.

"ఇవి సంవత్సరాంతం దినాలు కదా! ఆఫీసులోపని జాస్తిగా ఉంది. కనుక తీరికే చిక్కింది కాదు." అన్నాడు రాంబాబు ముక్తసరిగా.

"ఉం! అలాగా ఈ మధ్య మీ రచనలు ఏ పత్రికలోనూ అవుపించడం లేదు. కారణం_అదేనా?" అన్నాడు.

"అవును_తీరిక లేకనే" అన్నాడు రాంబాబు.

"ఈ మధ్య కొన్ని పత్రికల్లో 'కథల పోటీ' నిర్వహిస్తున్నట్లు చదివాను. ఏమైనా వ్రాశారా? వ్రాస్తున్నారా?"

"వ్రాయాలని అనుకుంటున్నాను, డాక్టరు గారూ! కాని మంచి 'థీమ్' దొరకడం లేదు." అంటూ యింకేదో అనబోతున్న రచయిత బయట ఎవరో పిల్చినట్లుగా అన్పించి, మధ్యలోనే ఆగిపోయాడు.

"అయ్యా! కండ్లులేనోన్ని బాంచను_"

"అయ్యా! చెవిటోన్ని బాంచను_"

"ధర్మ ప్రెబువులు ఓ పైస ధర్మం చేసుకోండి బాబూ"

"పుణ్యాత్ములు ఓ పైస పున్నెం చేసుకోండి బాబూ"

"ఛీ_ఈ పాడు వెధవలు ఎక్కన్నించి దాపురించార్రా బాబూ!" అంటూలేచి, ముష్టివాళ్ళను సమీపించి "ఏమిట్రా_అల్లరి? అసలు ధర్మం అడిగే సమయమేనా యిది. చిల్లర లేదిప్పుడు? రేపు యిస్తాను, వెళ్ళిపోండి" అంటూ కసురుకున్నాడు డాక్టర్.

"చిల్లర ఎంతకావాలె బాబూ!" అంటూ గుడ్డివాడు ముందుకొక అడుగు వేశాడు.

ఆ మాట విని డాక్టర్‌కు కోపం రెచ్చిపోయింది.

"ఉఁ! చిల్లర యిచ్చేస్తోమతురా మీది. ఒకవంద రూపాయలకు చిల్లరకావాలి యిస్తారా? మీరు..."

"అమ్మ బాబోయ్! అంతే...వద్దు బాబూ...అంత మావద్ద ఏడిది? పట్టెడన్నం పెట్టించండి సాలు..."

అన్నాడు గుడ్డివాడు బాధగా.

"ఉఁ! అన్నం-అన్నమడిగేవాళ్ళ ధోరణి, యిదేనా? సరే-యిక్కడ అన్నం లేదు-సున్నం లేదు, వెళ్ళిపోండి! చిల్లర యిచ్చేస్తామంటు ఉన్న మీకు, పట్టెడన్నమెందుకు? కడుపుకు చాలినంతగా దొరుకుతుంది...హోటల్లో!-రూపాయిన్నర పడేస్తే చాలు ఉఁ, వెళ్ళండి!" అంటు హుంకరించి విసురుగా తలుపులు మూసుకున్నాడు డాక్టర్.

లోపల్నుంచి యిదంతా విన్న రాంబాబులో కథకుడు మేల్కొని చిన్నగా మూలిగాడు. అతనితో రచనకు సంబంధించిన కలవరం బయలు దేరింది. లేనివాడు ఉన్నవాని ముందు ఎంత లోకువ? మరి ఉన్నవాడు లేనివాణ్ని యింత యిదిగా కసురుకోవచ్చునా? ఛి-ఛి-ధనవంతులలో ఎంత అహం భావం! మనిషి, మనిషినీ పైసా, పరకా అడుక్కునే ఒక మామూలు బిచ్చగాడు, పది పదులతో సమానమైన ఒక వందరూపాయలకు చిల్లర యివ్వగలడా? ఎంత మాట? సులువుగా లేదు పొమ్మన డానికి బదులు ఎన్ని మాటలు.,.రాంబాబు సంఘర్షణలో పడిపోయి ఆలోచిస్తున్నాడు.

"చూశారా! రాంబాబుగారూ! వీళ్ళకు ఎంత కానరమో!" అన్న డాక్టర్ మాటతో ఈ లోకంలోకి వచ్చిపడ్డాడు రాంబాబు.

"పోనీ-వాళ్ళేదో ముష్టివెధవలు. ఎవరితో ఎలా మాట్లాడాలో వాళ్ళకేం తెలుసు?" అంటూ సరిపెపాడు రాంబాబు-వాళ్ళ మీది జాలిని చంపుకోలేక.

నిట్టూరుస్తూ కుర్చీలో కూర్చున్న డాక్టర్ వంట మనిషిని పిల్చి - "ఫ్లాస్కులో కాఫీ ఉందా?" అని అడిగాడు.

కాఫీ త్రాగబోతున్న డాక్టర్, రాంబాబులకు - అప్పుడు సమయం ఎంతైందీ గుర్తు చేస్తూ, గోడ గడియారం "టంగ్-టంగ్" మంటూ నాలుగు వాయించింది.

"మీకు హాస్పిటల్ వేళ అయిందికదా! ఇకనే వెళ్తాను" అంటు రాంబాబు లేచాడు.

"సరే" అంటూ డాక్టర్ కూడ లేచి, రాంబాబుతో కొంత దూరం బయటకు వచ్చి "యికనే ఉంటాను" అంటూ కరచాలనం చేసి "తీరిక ఉన్నపుడల్లా వస్తూండండి" అంటు లోనికి వెళ్ళిపోయాడు.

"సరే-అలాగే" అంటూ అవే ఆలోచనలతో ఇంటకి తిరుగు ముఖం పట్టిన రాంబాబుకు మార్గంలో, తన సహ రచయిత సోంబాబు కలిశాడు 'హలో' అంటూ ఇద్దరూ పరామర్శించుకున్నారు. కరచాలనం చేసుకుంటూ "ఏం రాంబాబుగారూ! మీ రచనలు ఏ పత్రికల్లో కూడా రావడం లేదు ఎందుకు?" అన్నాడు సోంబాబు.

"ఆఫీసులో పని జాస్తిగా ఉంది. అందుకే తీరిక లేక వ్రాయడం లేదు" అని రాంబాబు చెబుతుండగానే మధ్యలో సోంబాబు అందుకుని 'అలా వెళ్దాం పద' అంటు ముందుకు దారి తీసి 'అది సరేగాని...కథల పోటీకి ఏదైనా కథ వ్రాశారా?' అని అడిగాడు-రాంబాబు.

"ఇంకా ఏం వ్రాయలేదు. వ్రాయాలనుకుంటున్నాను." అన్నాడు రాంబాబు అతని ప్రశ్నకు





ఎల్లప్పుడూ...

ఒలింపిక్

బ్లూ బర్డ్ బనియన్లనే

ఉపయోగించండి.

: తయారించువారు :

ఒలింపిక్ నిట్టింగ్ కంపెని, తిరుపూరు - 638 604

జవాబుగా.

"ప్లాట్ ఏదైనా ఆలోచించారా!"

"ఇంకాలేదు. ఏదో ఒకటి ఆలోచించాలి!" అని క్షణం ఆగి 'మరి మీరు?" అని అడిగాడు సోంబాబు.

"కూలి జీవితం గురించి ఒక చక్కని కథ వ్రాసి పోటీకి పంపించాలను కుంటున్నాను." అన్నాడు సోంబాబు.

"కూలి జీవిత మంటే-మీ అభిప్రాయం?" అన్నాడు రాంబాబు. క్రింది తరగతి జీవితాల గురించి అంతగా అవగాహన లేని ఆతరతతో.

అదొక పిచ్చి ప్రశ్నలా తోచిన సోంబాబు చిన్నగా నవ్వాడు. రాంబాబు దెబ్బతిన్నవాడిలా ఫీలయ్యాడు.

"ఊహుఁ! అలాకాదండీ! నేననేది ఒక బీద కుటుంబాన్ని తీసుకుని కథ నడపాలను కుంటున్నారు కదా! అది నేటి సమాజానికి ప్రతి బింబంలా ఉండాలంటే ఎలా వ్రాస్తే బాగుంటుంది" అంటు సమర్థించు కున్నాడు రాంబాబు.

"ఓఁ-అదా మీ సందేహం? అలా అడగండి చెబుతాను" అంటు ఏదో చెప్ప పోతున్నంతలో, ఒక బిచ్చగాడితో మరొక బిచ్చగాడు ఎదురుగా వచ్చి-'ఒక పైసా ధర్మంచేసుకోండి బాబూ"...అంటు ఏక కంఠంతో దీనంగా అడిగారు.

"చాల్లెండి-మధ్య మీదొక గొడవ. పైసాలేదు. పాడూ లేదు. పోండి." అంటు ప్రక్కకు జరిగి కసురు కున్నాడు సోంబాబు, అంతకు ముందే డాక్టర్ యింటి వద్దవాళ్ళ గొంతు విన్న రాంబాబుకు హృదయం కరిగి పోయి-జాలివేసింది. "నిజానికి వాళ్ళు ముష్టెత్తుకుని బ్రతకాల్సిన వాళ్ళే" అనుకుని 'ఇదిగో నా వద్ద చిల్లరుంది' అంటూ జేబులోంచి పావలా బిళ్ళతీసి గుడ్డివాని చేతిలో ఉంచాడు. నిరాశతో జేవురించి పోతున్న వాళ్ళ మొహాలు ఆ మాట విని విప్పారినై.

"సల్లంగ బతకండి బాబూ" అంటు వెనక్కి తిరిగారు.

మామూలు రెండణాలు ధర్మం చేసుకోలేని రచయిత-కూలి జీవితం గురించి కథ వ్రాసి ఎవరిని ఉద్ధరిస్తాడో అర్థంకాలేదు రాంబాబుకు, ఇక అతని వద్ద ఉండాలనిపించలేదు.

వెంటనే 'సోంబాబుగారూ! యికనే యింటికి వెళ్ళాలి. సమయం అయిదు కావస్తుంది. మా ఆవిడను హాస్పిటలుకు తీసుకు వెళ్ళాలి' అంటు సోంబాబు నుండి రాంబాబు సెలవు తీసుకుని బయలు దేరాడు.

సమయిం ఏడు కావస్తుంది. బయట వీధి లైట్లు వెలిగాయి. రాంబాబు లైబ్రరీలో కాసేపు చదువుకుని లోపల ఆకలిగా ఉండడంతో యింటికి వెళ్ళాలని లేచాడు. గేట్ రిజిస్టర్‌లో యిన్సియల్ వేసి బయటకు వచ్చాడు.

ఇంటికి వస్తున్న రాంబాబుకు త్రోవలో ఒక పెద్ద మర్రివృక్షం ఎదురైంది. ఆ చెట్టు క్రింద బిచ్చగాళ్ళు బస చేస్తూ ఉంటారు.

రాంబాబు అటుచూస్తూ నడుస్తున్నాడు. అయిదారుగురు బిచ్చగాళ్ళు ఒకే చోట పంక్తిగా కూర్చుని భోజనం చేస్తున్నారు. అదే పంక్తిలో తన కెదురైన ఇద్దరు బిచ్చగాళ్ళు, చెవిటి వాడు-గుడ్డివాడు కూడా ఉన్నారు. అందరూ అడిగి తెచ్చుకున్న పదార్థాలను విప్పి ఒకే చోట ఉంచారు. ఐక్యంగా అందరూ పరస్పరం ఎవరికి కావల్సిన పదార్థం వాళ్ళు, వడ్డించుకుని హాయిగా తింటూ-ఉత్సాహంగా ఆరోజటి వింతలూ, విశేషాలూ మాట్లాడు కుంటున్నారు.

—వాళ్ళలో కుల మత వైషమ్యాలు లేవు-పెద్దా, చిన్న భేదం లేదు.

—కుంటివాడూ, గుడ్డివాడు, చెవిటి వాడు, అంగ వైకల్యంగల ప్రతివాడూ, వాళ్ళకు బంధువే!

—వాళ్ళు ముష్టివాళ్ళు-వాళ్ళవి అతుకుల బ్రతుకులు!

—యాచించి బ్రతికే వాళ్ళంతా కలిసి ఒక కుటుంబం!

కథ వ్రాయాలి, తనకో 'ప్లాట్' కావాలంటూ, కథ కోసం చక్కని 'థీమ్' ఆలోచిస్తు సతమత మవుతున్న రాంబాబుకు, ఇక వేరే 'థీమ్' కోసం వెతకాల్సిన అవసరం లేక పోయింది.

---

"కథాంజలి"లో వెలువడే కథలన్నీ కేవలం కల్పితము. ఎవరినీ ఉద్దేశించి వ్రాసినది కాదు. రచయితల రచనలకు మేము ఏమాత్రము బాధ్యులుకాదు. —సంపాదకుడు.